

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 269 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 30, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# సీపి మార్క్ పై.. సర్వత్ర హర్షం !



సంఘవిద్రోహశక్తుల భరతం పడుతున్న సీపి శ్వేతా రెడ్డి ఐపీఎస్

మహానగరంలో పెరిగిపోతున్న అసాంఘిక శక్తుల ఆగడాలు

భూకబ్జాదారులపై ప్రత్యేక నిఘా వేసిన సీపి

రాజకీయ అండ బలుపుతో రెచ్చిపోతున్న భూమాఫియా

ప్రజారక్షణకు తీవ్రమైన ఆటంకాలు సృష్టిస్తున్న గంజాయి బ్యాచ్ లను ఏరిపారేస్తున్నారు

క్రింది స్థాయి పోలీసుల పనితీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలదు !

గుండాయిజాన్ని గడగడలాడిస్తేనే మహా నగరానికి రక్షణ

ఎన్ఐటి,కాకతీయ,కేఎంసీలలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్ మాఫియా

ప్రైవేట్ విద్యా సంస్థలలో పేరుకు పోతున్న గంజాయి మాఫియా

సీపి పనితనానికి సరితూగ లేకపోతున్న స్టేషన్స్ అధికారులు

ప్రజారక్షణకు పట్టుబట్టి పనిచేస్తున్న వరంగల్ సీపి

స్థానిక,దీర్ఘకాలిక స్టేషన్స్ రైటర్స్ తో చాలా ప్రమాదం, వాళ్లకు స్థానచలనం ఎంతో ముఖ్యం

సాంకేతిక పద్ధతిలో నేరాలను అరికట్టనున్న సీపి ఎన్ శ్వేతా రెడ్డి ఐపీఎస్

డాక్టర్ బరిగెల శివ

**వరంగల్ మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీపీ ఎన్.శ్వేతారెడ్డి ఐపీఎస్ తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. భూకబ్జాలు, గంజాయి, డ్రగ్స్, గుండాయిజం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్లు డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని భూకబ్జాలకు పాల్పడుతున్న మాఫియా ముఠాలపై ప్రత్యేక నిఘా అవసరమని ఆయన అన్నారు. విద్యాసంస్థలు, యువతను లక్ష్యంగా చేసుకుంటున్న మాదకద్రవ్యాల మాఫియాను కట్టడి చేయడంలో మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని** వినియోగిస్తూ నేరాలను గుర్తించి అరికట్టే దిశగా సీపీ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. పోలీస్ స్టేషన్ల స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు, సిబ్బందికి నిరంతరం దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బంది స్థానిక ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉన్నందున బదిలీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సామాన్య ప్రజలపై అక్రమ కేసులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తావులేకుండా పోలీసింగ్ పారదర్శకంగా ఉండాలని సూచించారు. భూమాఫియా, డ్రగ్స్ మాఫియా, గంజాయి ముఠాలతో పాటు ప్రజలను భయబ్రాంతులకు గురిచేసే గుండాయిజాన్ని సమూలంగా అరికట్టాలని ప్రజల ఆకాంక్షగా పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడుతూ రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాత పోలీసింగ్‌ను కొనసాగిస్తే వరంగల్ మహానగరంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని డాక్టర్ బరిగెల శివ విశ్వాసం వ్యక్తం చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2











డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

4

### తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్



## ఇందిరా నగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

4

మంత్రి పొన్నం ప్రభాకర్

మీ సమస్య నా సమస్య.. మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత




## నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

500 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

పటిష్ట బందోబస్తు.. విస్తృతంగా పోలీస్ పెట్రోలింగ్: సీపీ ఎన్. శ్వేత



3

## మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి


తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం

భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్

సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# సీపి "మార్కు"పై సర్వత్ర హర్షం






**సంఘవిద్రోహశక్తుల భరతం పడుతున్న సీపి శ్వేతా రెడ్డి ఐపీఎస్**

**మహానగరంలో పెరిగిపోతున్న అసాంఘిక శక్తుల ఆగడాలు**

**భూకబ్జాదారులపై ప్రత్యేక నిఘా వేసిన సీపి**

**రాజకీయ అండ బలుపుతో రెచ్చిపోతున్న భూమాఫియా**

**ప్రజారక్షణకు తీవ్రమైన ఆటంకాలు సృష్టిస్తున్న గంజాయి బ్యాచ్ లను ఏరిపారేస్తున్నారు**

**క్రింది స్థాయి పోలీసుల పనితీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలదు !**

**గుండాయిజాన్ని గడగడలాడిస్తేనే మహా నగరానికి రక్షణ**

**ఎన్ఐటి,కాకతీయ,కేఎంసీలలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్ మాఫియా**

**ప్రైవేట్ విద్యా సంస్థలలో పేరుకు పోతున్న గంజాయి మాఫియా**

**సీపి పనితనానికి సరితూగ లేకపోతున్న స్టేషన్స్ అధికారులు**

**ప్రజారక్షణకు పట్టుబట్టి పనిచేస్తున్న వరంగల్ సీపి**

**స్థానిక,దీర్ఘకాలిక స్టేషన్స్ రైటర్స్ తో చాలా ప్రమాదం,వాళ్లకు స్థానచలనం ఎంతో ముఖ్యం**

**సాంకేతిక పద్ధతిలో నేరాలను అరికట్టనున్న సీపి ఎన్ శ్వేతా రెడ్డి ఐపీఎస్**

**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ట్రై సిటీ పట్టణంలో రెచ్చిపోతున్న భూమాఫియాను రెప్పపాటులో అరికట్టేందుకు వరంగల్ సీపి ఎన్ శ్వేతారెడ్డి ఐపిఎస్ మొండి పట్టుదలతో ముందుకు సాగుతున్నారని డాక్టర్ బరిగెల శివ తన విశ్వాసాన్ని ప్రకటించారు.ప్రజల విశ్వాసానికి అనుకూలంగా పనిచేయడం కోసం సిపి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని వివరించారు.ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పని చేయడంలో ఎంతటి ఆత్మ గౌరవం దాగి ఉంటుందో వరంగల్ సిపి వాటిని చేసి నిరూపిస్తున్నారని అభినందించారు.సామాన్య ప్రజలను వేధిస్తున్న అల్లరి మూకలను,సామాన్య ప్రజల ఆస్తులపై దాడులు చేస్తున్న భూమాఫియాను,సామాన్య ప్రజలు నివాసం చేస్తున్న ప్రాంతాలలో అసాంఘిక శక్తుల ఆగడాలు,విద్యాసంస్థలలో విచ్చలవిడిగా కొనసాగుతున్న డ్రగ్స్ గంజాయి మాఫియాలను అరికట్టేందుకు మొదటి నుండి తన సంసిద్ధతను కనపరుస్తూ మహానగర బాగోగులను తన భుజస్కంధాలపై వేసుకున్నారన్నారు.వరంగల్ ప్రాంతం అంటేనే రాజకీయ ప్రభావానికి ప్రత్యేకగా నిలుస్తుందని చారిత్రాత్మక సంఘటనలు తెలియజేస్తుండగా రాజకీయ వ్యక్తులను రాజకీయ పలుకుబడిని రాజకీయ నాయకుల అనుచరులు కొనసాగిస్తున్న ఆగడాలను అరికట్టడమే కాకుండా సామాన్య ప్రజల రక్షణ కోసం సాధారణ ప్రజలకు అండగా నిలవడం కోసం సాంకేతిక పరమైన పోలీసింగ్ విధానాన్ని అమలు పరచడంలో సీపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ సఫలీకృతం అవుతున్నారని తెలిపారు.ప్రజలతో మమేకం అవ్వడం కోసం పోలీసులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ పోలీసులు ప్రజల పట్ల సంకుచిత భావాన్ని వీడి సమర్థవంతమైన భావాలతో ప్రజలను రక్షించడంలో భాగంగా పోలీసు సేవలను సమన్వయ పరచాలనే భావంతో పనిచేయాలని పోలీస్ శాఖను తీర్చిదిద్దడం తను నమ్ముకున్న ప్రత్యేకతలో భాగమన్నారు.

**స్ట్రాంగ్ పోలీసింగ్..**

పోలీస్ వృత్తి అంటేనే సమాజాన్ని ఉన్నత స్థాయిలో ప్రభావితం చేసేదని పోలీసులు నిర్వహిస్తున్న విధుల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు నమ్మకం పెరిగేదిగా ఉండాలనే దృఢమైన సంకల్పాన్ని ప్రజల్లో నమ్మకం కల్పించడం కోసం సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ పేద ప్రజల మనోభావాలను దెబ్బ తినకుండా స్టేషన్స్ అధికారులు నిర్వహిస్తున్న విధుల పట్ల ప్రజలకు చేస్తున్న సేవల పట్ల ప్రత్యేకమైన దృష్టి పెట్టడమే కాకుండా సెట్ కాన్ఫరెన్స్ లలో ప్రతి విషయాన్ని లోతైన స్థాయిలో విచారణ చేస్తూ వివరణలు సేకరిస్తూ ప్రజల పట్ల ఏ విధంగా విధులు నిర్వహించాలో పోలీస్ సిబ్బందిని ఆయత్త పరుస్తున్న తీరు అద్భుతం అన్నారు.స్ట్రాంగ్ పోలీసింగ్ విధానంలో భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపాలని సిపి ప్రతి సందర్భంలో హెచ్చరిస్తున్నప్పటికిని స్టేషన్స్ అధికారులు రాజకీయ పలుకుబడి కలిగిన భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ప్రతి చోట క్షేత్రస్థాయి అభియోగాలు వస్తున్నాయని వాటన్నిటిని సిపి లోతైన కోణంలో నిగూఢమైన సమాచారాలను సేకరిస్తున్నారని ప్రజల విశ్వాసాన్ని తెలియజేశారు.రాజకీయపరంగా పలుకుబడి కలిగిన నాయకులంతా భూకబ్జాలలో ఆరితేరిపోతున్నారని అలాంటి వాళ్లపై రెచ్చిపోవాల్సిన పోలీసులు సామాన్య ప్రజలను విచ్చలవిడిగా భయపెడుతున్నారని అలాంటి సందర్భాలు ఇప్పటికే సీపి దృష్టికి చేరినట్లు విశ్వాసనీయ సమాచారం అన్నారు.ముఖ్యంగా ఒకే ప్రాంతంలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న స్టేషన్స్ రైటర్స్ స్థానికత ఆధారంగా పోస్టింగులు నిర్వహిస్తూ ఆయా ప్రాంతాలను వాళ్ళకబంధహస్తాల్లో పెట్టుకొని అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ కేసులు కట్టే విధానంలో కేసులను తారుమారు చేసే విధానంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని వాళ్లపై ప్రత్యేకమైన నిఘా వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో వాళ్లకు తిరుగులేని శక్తిసామర్థ్యాలను సంపాదించుకొని రాజకీయ పలుకుబడిని, రాజకీయ అండదండలను,స్టేషన్స్ అధికారుల ప్రోత్సాహాన్ని ఆసరగా మలుకుంటూ భూకబ్జాదారులకు సహకరించడంలో ఆరితేరిపోతున్నారని అదే సందర్భంలో సామాన్య కుటుంబాల ఉసురుపోసుకోవడంలో కూడా వెనకాడడం లేదంటూ పలుకుబడి కలిగిన వ్యక్తులకు సహకరిస్తూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లుగా మహానగర ప్రజలు మొత్తుకుంటున్నారని సీపి దృష్టికి తీసుకువచ్చారు.తప్పుడు భూపత్రాలు సృష్టించుకోవడం నేరుగా భూములను కబ్జాలు చేయడం కబ్జా భూములకు స్టేషన్ పోలీస్ అధికారులను అండగా వాడుకోవడం వాటితో పాటు భూ సెటిల్మెంట్లు చేయడం మహానగరంలో ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు నిరంతర అలవాటు ప్రక్రియలో భాగంగా ముందుకు సాగుతున్నారని సామాన్య ప్రజలను తీవ్రమైన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాటిని పూర్తిస్థాయిలో అరికట్టి, నిర్మూలించి నిరంతరం భూకబ్జాలకు పాల్పడుతున్న భూమాఫియాను అంతమొందించాలని ప్రజల బాధలను సిపి దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ కక్ష సాధింపులకు సంబంధించిన కేసులు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు సామాన్యులను వేధిస్తున్నారని అలాంటి వేధింపుల ప్రక్రియలో భాగంగానే అనేకమైన అక్రమ కేసులు సామాన్యులపై పెడుతూ రౌడీషీటర్లుగా ముద్రలు వేసి రాజకీయ మెప్పుకోసం, అధికార పోస్టింగుల కోసం ఆరాటంతో కూడిన పనులు చేస్తున్న స్టేషన్స్ అధికారులు లేకపోలేదని వాళ్లందర్నీ గుర్తించి సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయం పట్ల ప్రత్యేకమైన దృష్టి సారించాలని సిపిని కోరారు.

**సీపి పరిజ్ఞానంలో ప్రతిభకు తిరుగులేదు..**

వరంగల్ సిపిగా బాధ్యతలు చేపట్టే ముందు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రధానమైన ప్రాంతాల్లో అధికార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవం కలిగినందున వరంగల్ సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ ముందస్తుగానే ఉమ్మడి వరంగల్ జిల్లా, మహానగర ప్రజల నుండి ప్రత్యేకమైన గౌరవాన్ని ఏర్పాటు చేసుకోగలిగినారని గుర్తు చేశారు.విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, సీనియర్ సిటిజన్స్, మహిళా సంఘాలు,కార్మిక సంఘాలు, ప్రతి ఒక్కరు పోలీస్ సేవలను ఉన్నత స్థాయిలో ఆస్వాదించడానికి ఎదురు చూశారని అభిప్రాయపడ్డారు.అదే సందర్భంలో రాజకీయ నాయకులు,భూకబ్జాదారులు, డ్రగ్స్ మాఫియా,గంజాయి మాఫియా,రౌడీ మాఫియా,లిక్కర్ మాఫియా,ఇసుక మాఫియా,వాళ్లు కొనసాగిస్తున్న వ్యాపారాలకు అడ్డొస్తున్న సామాన్యులను కిరాతకంగా అణిచివేస్తున్నారని వాటన్నిటికీ క్రిందిస్థాయి పోలీసు సిబ్బంది సేవలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాడుకుంటున్నారని తెలియజేశారు.వరంగల్ మహానగరం అత్యంత దయనీయమైన స్థితిలోనికి నెటివేయబడుతుందని దినదినం రాజకీయ వేడి వాతావరణం ప్రజాసేవకు ఎంతో ఆటంకాలను సృష్టిస్తుందని గుర్తు చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొంతమంది అసాంఘిక శక్తులు విద్యార్థుల రూపంలో, ఉద్యోగుల రూపంలో, అధికారుల రూపంలో,అధ్యాపకుల రూపంలో ,ఆచార్యుల రూపంలో పలురకాల మొబైల్ నెంబర్లను వాడుతూ సోషల్ మీడియాలో మహిళలను దారుణంగా అవమానపరుస్తూ వ్యక్తిగత గ్రూపులు సృష్టించుకుని వాటిలో మహిళలను అవమానకరంగా వేధిస్తున్నారని వాటన్నిటిని సిపి ప్రత్యేక కోణంలో దృష్టి సారిస్తూ అటువంటి సాంకేతిక అసాంఘిక శక్తుల భరతం పట్టాలని కోరారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో వ్యక్తిగతంగా పలు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని మహిళలను వేధిస్తున్న అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

**మహానగరంలో మాఫియాలు..**

వరంగల్ మహానగరం సాంకేతిక పోరాటాలకు, ఉద్యమ ప్రస్థానాలకు కేంద్రబిందువుగా ఉంటుండగా మహానగరాన్ని మాఫియా ముఠాలతో దాడులు చేయిస్తున్నది మాత్రం ముమ్మాటికి రాజకీయ నాయకులనే చెప్పక తప్పదన్నారు.ట్రై సిటీలో ప్రతి ఏరియాలో డ్రగ్స్, గంజాయి విపరీతంగా పెరిగిపోతుందని యువతను సరియైనమార్గంలో పెట్టడం ఎవరి తరం కావడంలేదని గుర్తు చేశారు.యువతను మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారిగా సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ సమర్థవంతమైన, శక్తివంతమైన,ఆదర్శవంతమైన, ప్రణాళికలతో కట్టడి చేస్తున్నప్పటికిని ఇతర అధికారుల బాధ్యత, యువత కుటుంబాల తల్లిదండ్రుల బాధ్యత,రాజకీయ నాయకుల బాధ్యత,కనీసం సహకారంగా ఉండలేకపోవడం దురదృష్టకరం అన్నారు.పైగా రాజకీయ నాయకుల ప్రతి రాజకీయ సమావేశాల్లో, రాజకీయ మీటింగ్లలో యువత ఎక్కువ స్థాయిలో పాల్గొంటూ గ్రూపు రాజకీయాలకు అలవాటు పడి జీవితాలను ఆగం చేసుకుంటున్నారని అదే సందర్భంలో రాజకీయ నాయకుల మోజులో పడి రాజకీయాల వైపు తిరుగుతూ డ్రగ్స్ గంజాయి మద్యం లాంటి అలవాట్లను పెంచుకొని మహానగరాన్ని పాడు చేస్తున్నారని హెచ్చరించారు.సమాజం మొత్తాన్ని ఒక ఉన్నత అధికారిని బాధ్యతతో ముందుకు తీసుకెళ్తుంటే అంతే స్థాయిలో అసాంఘిక శక్తులు కొంత పలుకుబడి కలిగిన భూమాఫియా, రాజకీయ శక్తులు, యువతను సన్మార్గంలో నడవకుండా వెనక్కి లాగుతున్నారని వాళ్ళ వ్యక్తిగత స్వార్థాల కోసం, వ్యక్తిగత ఆస్తుల సంపద కోసం, వ్యక్తిగత రాజకీయ పలుకుబడి కోసం, యువత జీవితాలను నాశనం చేస్తున్నారని అదే సందర్భంలో రాజకీయ పలుకుబడిని పెంపొందించుకోవడం కోసం యువత జీవితాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితులను సృష్టిస్తున్నారని హెచ్చరించారు.రానున్న మున్సిపల్ ఎన్నికలలో ఇప్పటికే యువతపై కన్నేసిన రాజకీయ వర్గం యువతనే టార్గెట్ చేసుకొని ముందుకు నడుస్తున్నారని యువతను విద్య పరిజ్ఞానం, ఉద్యోగం జీవిత లక్ష్యాల వైపు నడిపించాల్సిన పెద్దలు మహానగరానికి, సమాజానికి, వ్యతిరేక శక్తులుగా తయారు చేస్తున్నారని మండిపడ్డారు.ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజారక్షణ మొత్తం కేవలం ఒక మహిళ సీపి అధికారిపై ఆధారపడడం,కొంతమంది డిసిపి స్థాయి అధికారులు సీపీకి సహకారవంతంగా అండగా నిలుస్తుండడం ప్రత్యేకంగా అర్బన్ నిఘా విభాగం తన ప్రతిభను మరొకసారి చాటుకుంటూ సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పసిగట్టడం ప్రత్యేకత తో కూడిన గొప్పతనం ఉన్నారు.రాజకీయాలకు అతీతంగా యువత అభివృద్ధి వైపు నడవాలని అలాంటి మార్గాలను ఏర్పాటు చేయడంలో వరంగల్ సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ సమర్థవంతమైన బాధ్యతలను సవాలుగా తీసుకున్నారని గుర్తుచేశారు.కేవలం అధికార పార్టీకి చెందిన నాయకులకు మాత్రమే గౌరవమిస్తూ మిగతా సామాజిక వర్గాల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని క్రింది స్థాయి పోలీసు వర్గాలపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్న సందర్భంలో ఒకవైపు భూమాఫియాను, మరోవైపు డ్రగ్స్, గంజాయి మాఫియాను, ఇంకోవైపు,అక్రమంగా పార్టీలు మారి ప్రజారక్షణకు క్షేత్రస్థాయి విఘాతం కల్పిస్తున్న రాజకీయ మాఫియాను అంచలంచెలుగా అరికట్టగలిగినప్పుడే మహానగరం అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందగలుగుతుందని మహానగరానికి సంరక్షకులుగా సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ నిలిచిపోగలరని మహానగర ప్రజల విశ్వాసాన్ని ప్రత్యేక కథనంతో తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో.. ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు - హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్**



**హసన్‌పర్తి, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

రాబోయే గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. శనివారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సైలు రవి, గోవర్ధన్ సమక్షంలో వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పీస్ కమిటీ సభ్యులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు అందరి సహకారంతో ప్రశాంతంగా జరగాలి. భక్తుల భద్రతతో పాటు ఇతర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి. మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి అని సూచించారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో నిర్వాహకులు కాపలా ఉండాలని, వీలైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ వైరింగ్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకండి. నిపుణుల సహాయంతో సురక్షితంగా విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవాలి. అనుమతి లేని విద్యుత్ కనెక్షన్లు ఉపయోగించకూడదు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది అని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. అదేవిధంగా ధ్వని కాలుష్య నియంత్రణ నిబంధనలు, కోర్టు ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగంపై ఉన్న పరిమితులను ఉల్లంఘించరాదు. అశ్లీల పాటలు, డీజేలకు అనుమతి లేదు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని కోరారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు క్రమశిక్షణ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లను ఆక్రమించడం, వాహనాలను అనవసరంగా నిలిపివేయడం చేయరాదన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య తలెత్తినా, అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసుల దృష్టికి తీసుకురండి. ప్రతి ఒక్కరి సహకారంతో గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహిద్దాం అని ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సైలు రవి, గోవర్ధన్ ఉత్సవ కమిటీ సభ్యులకు పలు భద్రతా, సాంకేతిక సూచనలు చేశారు. ఉత్సవాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ సూచనలు పాటించాలని కోరారు. సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు, ప్రముఖులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యూఆర్ఎస్ పాఠశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి 31న ఇంటర్వ్యూలు

**హన్మకొండ, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని యూఆర్ఎస్ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనేతర, ఇతర పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 31న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఎక్స్అఫీషియో ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31, 2026న ఉదయం 10:30 గంటలకు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని విద్యా సమీక్ష కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియలో ప్రధాన వంటవారు, సహాయక వంటవారు, శారీరక విద్యా ఉపాధ్యాయుడు, హిందీ ఉపాధ్యాయుడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలు, సంబంధిత అవసరమైన అన్ని పత్రాలతో నిర్ణీత సమయానికి ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అలాగే హిందీ, శారీరక విద్యా ఉపాధ్యాయుల పోస్టులకు హాజరయ్యే అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టు పరిజ్ఞానం, నైపుణ్యాలను పరిశీలించేందుకు విషయ పరిజ్ఞానం/నైపుణ్య పరీక్ష కూడా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్వ్యూ సమయంలో అవసరమైన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, నిర్ణీత సమయానికి వేదిక వద్ద హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఎక్స్అఫీషియో ప్రాజెక్టు అధికారి కోరారు.

## క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

# పల్లె సమస్యలపై పొన్నం 'స్పందన'

**గ్రామాల్లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న'**
**ప్రజల సమక్షంలో సమస్యలపై అధికారులతో సమీక్ష**
**అభివృద్ధి పనులకు హామీలు.. సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు**







**ఎల్కతుర్తి, ఆగస్టు 29 (జై భీమ్ న్యూస్):**

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారిని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా పాలనను నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్లాలనే లక్ష్యంతో 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ శాసనసభ్యుడు రాష్ట్ర రవాణా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఎల్కతుర్తి మండలంలోని సూరారం, దండేపల్లి, వీరనారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలను వారి గ్రామాల్లోనే నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారులను గ్రామానికి రప్పించి వారి సమక్షంలోనే సమస్యలపై సమీక్ష నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా మంత్రి పేర్కొన్నారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను నేరుగా మంత్రికి విన్నవిస్తున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు.

**గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం**

సూరారం, దండేపల్లి, వీరనారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల మౌలిక వసతులు, సాగునీరు, కాలువలు తదితర సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువస్తున్నారు. ఆయా గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశిస్తున్నారు.

**దండేపల్లికి భారీగా అభివృద్ధి పనులు**

దండేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉండటంతో అదే స్థలంలో నూతన పంచాయతీ భవనం మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల కోసం వీఓ భవనాల నిర్మాణానికి స్థలం దానం చేసిన శంకర్ నారాయణను మంత్రి అభినందించారు గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, అంగన్వాడీ భవనం తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వీరనారాయణపూర్--దండేపల్లి బ్రిడ్జి రోడ్డు మంజూరైందని, దండేపల్లి--సూరారం--ఎల్కతుర్తి, దండేపల్లి--బావుపేట రోడ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. దండేపల్లి నుంచి దేశరాజుపల్లి మీదుగా కమలాపూర్ వెళ్లే రహదారికి రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అంతర్గత సీసీ రోడ్లు, కాలువ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సూరారం సమస్యలపై ప్రత్యేక దృష్టి**

సూరారం గ్రామ ప్రజలు ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. బస్సు సౌకర్యం కూడా కల్పిస్తానని వారికి మాట ఇచ్చిరు ప్రజల ఇబ్బందులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**మూడు గ్రామాల్లోనూ సమస్యలపై సమీక్ష**

వీరనారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాల్లోనూ ప్రజలు తమ సమస్యలను మంత్రికి నేరుగా వివరించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి**

ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, సన్న వడ్ల బోనస్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కొత్త రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమీక్షించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు.

**రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని కోరారు. నీటి సంరక్షణకు ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు.

**మహిళా సంఘాలకు ప్రోత్సాహం**

మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందిస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను ప్రజలు విస్తృతంగా వినియోగించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

**విద్య, క్రీడలకు ప్రాధాన్యం**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో రాణించాలని కోరారు. దండేపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ**

బాలికలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని, అర్హులైన బాలికలకు ఆరోగ్య పరిరక్షణ చర్యలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన లక్ష్యం**

ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వచ్చి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సూరారం, దండేపల్లి, వీరనారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, జడ్పీ సీఈవో, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

**500 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు**
**పటిష్ట బందోబస్తు.. విస్తృతంగా పోలీస్ పెట్రోలింగ్: సీపీ ఎన్. శ్వేత**

**వరంగల్, 29 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్ పీజీ--2026 ప్రవేశ పరీక్ష సందర్భంగా పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత--2023లోని సెక్షన్ 163 అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే మైకులు, డీజేలు వినియోగిస్తూ ఊరేగింపులు నిర్వహించడం కూడా నిషేధించినట్లు పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ ఆంక్షలను అమలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ముందస్తుగా సమాచారాన్ని సేకరించేలా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సీపీ ఎన్. శ్వేత తెలిపారు. పరీక్షల సందర్భంగా వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పరీక్షార్థులు, వారి తల్లిదండ్రులు పోలీసుల సూచనలు పాటించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని ఆమె తెలిపారు.




# ఢిల్లీలో పెరిగిన సిఎన్‌జి ధరలు

**కిలోపై రూ.3.89 చొప్పన పెంపు**

న్యూఢిల్లీ,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్): దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ. 3. 89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ. 86. 98కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ. 95. 59, ఘాజియాబాద్‌లో రూ. 95. 59, గురుగ్రామ్‌లో రూ. 92. 01, మీరట్‌లో రూ. 95. 47, ముజఫర్‌నగర్‌లో రూ. 95. 47, షామ్లిలో రూ. 95. 47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్‌జీ కార్గో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వివరించింది. అలాగే, శీతాకాలం సమీపిస్తుండటంతో యూరప్ దేశాలు సహజ వాయువు నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పింది. దీంతో ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలొచ్చి సీఎన్‌జీ సరఫరా వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ఈ కారణంగానే రేట్లు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని ఐజీఎల్ వెల్లడించింది.

# 60 ఓట్ల మెజార్టీతో గెలిచాం.. అభివృద్ధి మాత్రం శూన్యం!

**11వ వార్డుపై నాయకుల నిర్లక్ష్యం..**
**ఐనవోలు 11వ వార్డు మెంబర్ నల్లబెట్ల కళ్యాణి చిన్న రాజు యాదవ్ ఆవేదన**



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు గ్రామంలో 11 వ వార్డులో అధికార పార్టీ నుంచి 60 ఓట్ల మెజార్టీతో గెలిపించిన వార్డు ప్రజలకు మాత్రం అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని వార్డు మెంబర్ నల్లబెట్ల కళ్యాణి చిన్నరాజుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కాలనీవాసుల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె అన్నారు.వార్డు మెంబర్‌గా ఎన్నికైనప్పటి నుంచి తమ వార్డును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎదురుచూస్తున్నామని, ఏడాది కాలం దాటుతున్నా ఇప్పటివరకు కనీస మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కరెంటు స్తంభాలు, రోడ్ల మరమ్మతులు వంటి కనీస అవసరాలు కూడా తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ వార్డులో అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామపంచాయతీలో పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదని ఆరోపించారు. గ్రామపంచాయతీలో నిధులు లేవని, ఎమ్మెల్యే నిధులు ఇవ్వడం లేదని గ్రామసభలో సర్పంచ్ చెబుతున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి ఎన్నో హామీలు ఇచ్చాం. అధికార పార్టీ నుంచి గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తామని చెప్పాం. కానీ గెలిచిన తర్వాత ఒక్క పని కూడా చేయలేకపోయాం. ప్రజలకు ఏమని సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. మాట ఇచ్చి నిలబెట్టుకోలేక సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోందని కళ్యాణి చిన్న రాజు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన వార్డు సభ్యురాలినే అయినప్పటికీ తమ వార్డుకు నిధులు తీసుకురావడంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకని ఆమె ప్రశ్నించారు. అధికారంలో ఉన్నది ప్రజల కోసం పనిచేయడానికే కానీ, ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అభివృద్ధిని మరిచిపోవడానికి కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, మండల అధికార పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని 11వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కరెంటు పోల్స్ తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు.ఇకనైనా మా వార్డుపై నిర్లక్ష్యాన్ని వీడి నిధులు కేటాయించాలి. లేదంటే ప్రజలకు ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ నాయకులపైనే ఉంటుంది" అని వార్డు మెంబర్ నల్లబెట్ల కళ్యాణి చిన్న రాజు యాదవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**జాతీయ క్రీడా దినోత్సవం**




**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

పాత్‌ఫైండర్ హై స్కూల్, ఐనవోలు నందు తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్యం మరియు మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు.తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. విద్యార్థులు తెలుగు పద్యాలు, ప్రసంగాలు, పాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు.అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టుస్ఫూర్తి మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఢ డైరెక్టర్ డా. ఎల్.ఎన్. న. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.డి. సుభానొద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు భాషా, సాంస్కృతిక మరియు క్రీడా కార్యకలాపాలకు పాఠశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# కేయూ క్యాంపస్ కళాశాలలో ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

**హన్మకొండ, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంసీఏ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ తెలిపారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. టీజీ ఐసెట్-2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు, అర్హత సాధించని అభ్యర్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, అవసరమైన ఫీజుతో హాజరుకావాలని సూచించారు. అయితే స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం టీజీ ఐసెట్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని, మరిన్ని వివరాలకు కాకతీయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పర్యవేక్షకుల పాత్ర కీలకం

**క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలి: డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి**





**వరంగల్, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్**

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పర్యవేక్షకుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రాల్లో పనిచేస్తున్న పర్యవేక్షకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, క్షేత్రస్థాయి పనితీరు, నిర్దేశిత లక్ష్యాల సాధనపై సంబంధిత కార్యక్రమాల అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా అందుతున్న సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా పర్యవేక్షకులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పర్యవేక్షకులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి సహాయక నర్సు మంత్రసానులు, ఆశా కార్యకర్తలు తమ విధులను సకాలంలో, సమర్థవంతంగా నిర్వహించేలా ప్రోత్సహించాలని, అవసరమైన చోట వారికి తగిన సహకారం, మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అందించిన ఆరోగ్య సేవలకు సంబంధించిన వివరాలను సంబంధిత సిబ్బంది అదే రోజున ప్రభుత్వ ఆరోగ్య సమాచార వ్యవస్థల్లో నమోదు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి వారం పొడి దినం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్తల ద్వారా జ్వర సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. తల్లి, శిశు ఆరోగ్య సేవలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ సంబంధిత ఆరోగ్య సమాచార పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న పాత వివరాలను రెండు రోజుల్లోగా పూర్తిగా నవీకరించాలని ఆదేశించారు. గర్భిణీలు, ప్రసవాలు, బాలింతలు, శిశువులకు అందుతున్న ఆరోగ్య సేవల వివరాలను సకాలంలో నమోదు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. క్షయ వ్యాధి నియంత్రణ, నిర్మూలన కార్యక్రమంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన డీఎంహెచ్ఓ, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులను అధిక సంఖ్యలో గుర్తించి కఫ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణ అయిన ప్రతి వ్యక్తికి సకాలంలో చికిత్స ప్రారంభించి, మందులు క్రమం తప్పకుండా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స ప్రారంభం, తదుపరి పర్యవేక్షణ వివరాలను సంబంధిత ప్రభుత్వ ఆరోగ్య సమాచార పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డా. బి. రాజా రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో కార్యక్రమాల అధికారులు డా. సాజిదా, డా. ఇక్తిదార్ అహ్మద్, జిల్లా నర్సింగ్ మేనేజ్‌మెంట్ అధికారి డా. మానస శ్యామల, జిల్లా కార్యక్రమ అధికారి అర్చన, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఎస్ఓ ప్రసన్న కుమార్, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి మనోజతో పాటు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు చెందిన జిల్లా స్థాయి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

## తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్

**విశాఖపట్టణం,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# నాణ్యమైన విద్యతో విద్యార్థుల హాజరు పెంచాలి

**ఎంఈఓ శ్రీనివాస్**
**ఎఫ్ఎల్ఎన్, ఏఐ ఆధారిత బోధనకు ప్రాధాన్యం..**
**బోధనా ప్రమాణాలు మెరుగుపరచాలి**





**హసన్‌పర్తి, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచడంతో పాటు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ సూచించారు. హసన్‌పర్తి మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలల ప్రధానాచార్యులతో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గది బోధనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేలా కృషి చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను గుర్తించి, అభ్యసన పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా బోధన కొనసాగించాలని సూచించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాల సాధనలో పాఠశాలలు వంద శాతం లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. మండలంలోని కృత్రిమ మేధస్సు ఆధారిత విద్యాబోధనకు ఎంపికైన 12 పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంఈఓ ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల అభ్యసనకు ఉపయోగించుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు నమోదును పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ గుర్తింపు విధానం ద్వారా హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా కార్యాలయ విధుల్లో ఉన్నప్పుడు ఆ వివరాలను, సెలవులో ఉన్నప్పుడు సెలవు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. యూడైస్ ప్లస్‌లో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరి వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని ఆదేశించారు. మరో పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను సంబంధిత పాఠశాలలో సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే ప్రశస్త్ అనువర్తనంలో ఉపాధ్యాయులందరూ నమోదు చేసుకుని, అందులోని విద్యా సంబంధిత వీడియోలను వీక్షించాలని సూచించారు. సంసిద్ధత పాఠాలను సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత పెంపొందించాలని అన్నారు. పాఠశాలల పరిశుభ్రత, మౌలిక వసతుల నిర్వహణ, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ సూచించారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం కల్పించి తల్లిదండ్రుల విశ్వాసాన్ని పొందేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండేలా చూడడంతో పాటు ఆహార భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు నిరంతరం సంప్రదింపులు జరిపి, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాజరు తగ్గడానికి గల కారణాలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని ఎంఈఓ ఎ. శ్రీనివాస్ స్పష్టం చేశారు. పాఠశాలల పనితీరును నిరంతరం సమీక్షించుకుంటూ విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, డి. రవికుమార్, ఆర్. రవీందర్తో పాటు హసన్‌పర్తి మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలల ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

# ఇందిరా నగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**
**మీ సమస్య నా సమస్య.. మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత**







**హనుమకొండ జిల్లా/ఎల్కతుర్తి, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం ఇందిరా నగర్ గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఇందిరా నగర్ గ్రామంలో మంత్రి పర్యటించి, గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరా నగర్ గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందని మంత్రి తెలిపారు. గ్రామంలో 44 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలావరకు నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలో రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. 96 మందికి పెన్షన్లు అందుతుండగా, ఇందుకోసం రూ.6.32 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 66 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.10.08 లక్షల ప్రయోజనం కల్పించామని, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 15 కుటుంబాలకు రూ.7.27 లక్షలు విడుదలయ్యాయని వివరించారు. 20 మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.10.09 లక్షలు, 41 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.6.20 కోట్ల రుణాలు అందినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లను 13 రకాల వస్తువులతో అందించామని మంత్రి తెలిపారు. 52 మంది రైతులకు రూ.37.61 లక్షల రైతు రుణమాఫీ, 235 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.93.04 లక్షలు, 52 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.10.57 లక్షలు అందాయని చెప్పారు. ఆరుగురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించామని, గ్రామంలో 69 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, 382 రేషన్ కార్డులకు సన్నబియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఇందిరా గాంధీ పేరు మీద ఏర్పడిన గ్రామం కావడం తనకు ప్రత్యేక గౌరవంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలు కోరిన విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కొన్ని సమస్యలు పేరుకుపోయాయని, ఇకపై సంక్షేమం, అభివృద్ధి రెండూ ప్రతి అర్హ కుటుంబానికి సమానంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో భాగంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘ భవనం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నీటి సంరక్షణకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. జలసిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షల వరకు అందిస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ బ్యాంక్‌లను విస్తృతంగా వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉండే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందిరా నగర్‌లో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించడంతో పాటు హోటళ్లకు ఒక్కొక్కటికి 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని కుటుంబాలను అధికారులు గుర్తించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి అన్నారు. 14--15 సంవత్సరాల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాలు వేయించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి, విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులు సహకరించాలని, పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాల వైపు అడుగులు వేయాలని మంత్రి సూచించారు. వాలీబాల్, కబడ్డీతో పాటు ఇతర క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, గ్రామంలో క్రీడా సామగ్రిని అందించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపుతో పాటు క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని వివరించారు. ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల సభ్యులు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునేలా రుణ పరిమితులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు బలపడితే గ్రామ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని అన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు. గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రజాపాలనలో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. "మీ సమస్య నా సమస్య.. మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత" అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గ్రామంలోని సమస్యలను సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, యువత, గ్రామ ప్రజలు సమష్టిగా పనిచేసినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తన నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు భావిస్తానని, ఏ గ్రామం పట్లా వివక్ష లేకుండా సమానంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 32 నెలల ప్రజా ప్రభుత్వ కాలంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూ, రాబోయే రోజుల్లో ఇందిరా నగర్ గ్రామానికి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. "మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి




**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**వరంగల్, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నోటీసులను త్వరితగతిన సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నోటీసులు అందజేసిన తేదీ నుంచి ఏడు రోజుల గడువు పూర్తైన అనంతరం విచారణ చేపట్టాలని తెలిపారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని సూచించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని ప్రతిరోజూ నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం నియమించిన ఏఈఆర్ఓలకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

**వరంగల్ జిల్లాలో 1,94,399 నోటీసులు జనరేట్**

వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 1,94,399 నోటీసులు జనరేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 11,173 నోటీసులను సంబంధిత ఓటర్లకు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోగా సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ కార్యాలయాల్లో సమర్పించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, డి. విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీఓ సుమ, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు..

**క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**





**హన్మకొండ, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

విద్య, వైద్య రంగాలతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండను ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జేఎన్ఎస్‌లో అభివృద్ధి చేసిన ఆధునిక క్రీడా సదుపాయాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించగా, జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తయిన బ్యాడ్మింటన్ స్టేడియాన్ని కూడా ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని, గత రెండున్నరేళ్లుగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరంగల్ ప్రాంతం క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఇక్కడి నుంచి పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుత తరం క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. క్రీడల్లో సాధించే ప్రతి విజయం కుటుంబం, గ్రామం, జిల్లా, రాష్ట్రానికి గర్వకారణమని, క్రీడాకారులు హనుమకొండ జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన రోజే తమకు నిజమైన బహుమతి అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జేఎన్ఎస్‌లోని ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లను మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. క్రీడాకారులు వీటిని తమ సొంత ఆస్తిగా భావించి సద్వినియోగం చేసుకోవడంతో పాటు పరిరక్షణకు సహకరించాలని కోరారు. స్పోర్ట్స్ స్కూల్‌కు ప్రత్యేక భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని, చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ మాట్లాడుతూ దాదాపు రూ.1.50 కోట్లతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణ పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేయగా, బ్యాడ్మింటన్ కోర్టులో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయి, ఏసీపీ జితేందర్‌రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు. వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసంలను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి: కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్




**హన్మకొండ, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వ్యవహారిక భాషా ఉద్యమం ద్వారా తెలుగు భాషకు నూతన దిశానిర్దేశం చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ అన్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ చిర్ర రాజు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నిత్య జీవితంలో మాట్లాడే భాషే నిజమైన ప్రజా భాష అని చాటిచెప్పిన గిడుగు రామమూర్తి తెలుగు భాషను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేశారని తెలిపారు. గిడుగు రామమూర్తి కృషి ఫలితంగా తెలుగు భాషలో సరళత, సౌలభ్యం, సహజత్వానికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. తెలుగు కేవలం మన భాష మాత్రమే కాదని, మన సంస్కృతి, చరిత్ర, అస్తిత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచీకరణ వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషను కాపాడుకోవడం, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గిడుగు రామమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడాలని, చదవాలని, రాయాలని పిలుపునిచ్చారు. సులభ భాషే మధుర భాష -- వ్యావహారిక భాషే ప్రజల భాష అనే గిడుగు రామమూర్తి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ లింగయ్య, డాక్టర్ సదాశివ్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ స్వామి నాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గిడుగు రామమూర్తి సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.

## కొత్త కారు ప్రారంభంలో విషాదం

**అదుపుతప్పి మామపైకి దూసుకెళ్లిన కారు**

**హైదరాబాద్,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

కొత్త కారు కొన్న ఓ కుటుంబం సంతోషం నిమిషాల వ్యవధిలోనే విషాదంగా మారింది. కారుకు పూజ చేయించడం కోసం అల్లుడితో పాటు గుడికి వెళ్లిన మామ.. అదే కారు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఓ దంపతులు ఇటీవల కొత్త కారును కొనుగోలు చేశారు. దానికి పూజ చేయించేందుకు తమ బంధువు(మామయ్య) రామచంద్రరావును ఆహ్వానించారు. దీంతో అల్లుడు, కుమార్తెతో కలిసి పెద్దమ్మగుడికి వెళ్లారాయన. అల్లుడు కారును డ్రైవింగ్ చేస్తుండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి రామచంద్రరావు మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన కుటుంబసభ్యులు.. హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎదురించకు ఎదుగుదలను.. ప్రోత్సహిస్తేనే సమాజంలో మార్పు

**ఈర్ష్యతో రగిలిపోవడం ఆరోగ్యానికే కాదు.. అభివృద్ధికి కూడా చేటు**

**అమరావతి, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**


సామాజిక శాస్త్రవేత,కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్ .

సాటి మనిషి ఎదుగుదలను చూసి అభినందించాల్సింది పోయి ఈర్ష్యతో రగిలిపోవడం, వారి ప్రతిభను అణగదొక్కేందుకు ప్రయత్నించడం సమాజానికి ఏమాత్రం మేలు చేయదని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. ఎదుటివారి విజయాన్ని అభినందిస్తూ, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినప్పుడే వ్యక్తిగతంగానే కాకుండా సామాజికంగా కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. “అభినందించాలి గాని అదిరిపడటమెందుకు? ఆహ్వానించగలిగినా ఆయాసపడటమెందుకు? ఇన్నోవేషన్స్ చేస్తున్న వారికి కాంప్లిమెంట్ ఇవ్వడానికి ఎందుకు వెనుకాడాలి?” అని ఆయన ప్రశ్నించారు. కొత్త ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలు చేస్తున్న వారిని ప్రోత్సహించాల్సింది పోయి వారిపై ఈర్ష్యపడటం, విమర్శలు చేయడం వల్ల వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఈర్ష్యతో రగిలిపోవడం ఆరోగ్యానికి కూడా చేటు చేస్తుందని సూచించారు. మనలోని లోపాలను ఎత్తిచూపి మంచి మార్గాన్ని సూచించే వ్యక్తిని శత్రువుగా చూడకూడదని, “ఉపాయాలు చెప్పేవాడు ఉపకారే గాని అపకారి కాదు” అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. ఊరంతా బంధువులు, పరిచయస్తులు ఉన్నా అవసరమైన సమయంలో సానుభూతితో సహాయం చేసే వ్యక్తి లేకపోతే ఆ బంధాలకు అర్థం ఉండదన్నారు. కష్టకాలంలో తోడుగా నిలిచే వ్యక్తే నిజమైన బంధువని పేర్కొన్నారు. మనకు సహాయం చేసిన వారి పట్ల కృతజ్ఞతతో వ్యవహరించాలని, ఋణం తీర్చుకోవడానికి కాలయాపన చేయకూడదని డా. ఇమ్మానుయేల్ సూచించారు. కాలానికి వేగం ఎక్కువని, మన జీవితంలో లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఎందరో మహనీయుల జీవితాల్లో మొదటగా తల్లిదండ్రులు, స్నేహితులు, గురువుల ప్రోత్సాహమే విజయానికి పునాదిగా నిలిచిందని గుర్తుచేశారు. “ఎదుగుదలను ఎదురించకు.. ఏ మనిషికి దేవుడేమి రాశాడో ఎవరికి తెలుసు” అని ఆయన అన్నారు. ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. చదువుకుంటే సరిపోదని, ఉద్యోగం వస్తేనే జీవితంలో విజయం సాధించినట్లుగా భావించకూడదని, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు, మానవత్వంతో కూడిన ప్రవర్తన, ఇతరులకు సహాయం చేసే మనస్తత్వం కూడా అవసరమని తెలిపారు. “ఒక్కరినైనా మనం ప్రోత్సహిస్తున్నామా?” అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలని అన్నారు. సాటి మనిషిని ప్రేమించడంలోనే మనం ఓడిపోతున్నామని, స్వార్థం పెరిగిపోవడం వల్ల మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులు చెప్పే జీవిత పాఠాలను స్వీకరించి, వాటి నుంచి నేర్చుకోవాలని సూచించారు. అందరూ సమానమేనని చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం స్వార్థానికి ప్రాధాన్యత పెరుగుతోందని అన్నారు. స్వార్థాన్ని పక్కనపెట్టి మానవత్వం, ప్రేమ, పరస్పర సహకారం, గౌరవం వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎదుటివారి ఎదుగుదలను చూసి అసూయపడకుండా, వారికి చేయూతనిస్తూ ముందుకు నడిపించగలిగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. చివరగా “మనం మారితే లోకం మారుతుంది” అనే భావనను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని డా. మేడపాటి ఇమ్మానుయేల్ పిలుపునిచ్చారు. ఇతరుల ఎదుగుదలను అడ్డుకోవడం కాకుండా ప్రోత్సహించడం, ప్రతిభను గుర్తించడం, అవసరమైన వారికి సహాయం చేయడం, సాటి మనిషిని ప్రేమించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని ఆయన తెలిపారు.

## హనుమకొండలో రోడ్డు ప్రమాదం.. గుర్తుతెలియని వ్యక్తి మృతి



**హన్మకొండ, 29 సెప్టెంబర్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండ చౌరస్తా సమీపంలోని జోయాలుక్కాస్ షోరూమ్ ఎదురుగా మంగళవారం ఉదయం 5:30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందగా, పోలీసులు మృతదేహాన్ని హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో అతని కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల కోసం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా లేదా అతని వివరాలు తెలిసినా వెంటనే హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్.హెచ్.ఓ కోరారు. సమాచారం కోసం 8712685002, 8712685113 నంబర్లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

# వరంగల్ జిల్లాలో.. గుడుంబా దందా జోరు?

## రోహిత్ వేముల చట్టం కోసం ఎఎస్ఎ రౌండ్ టేబుల్ సమావేశం




**హైద్రాబాద్, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిపై కొనసాగుతున్న వివక్షకు అడ్డుకట్ట వేయడంతో పాటు రోహిత్ వేముల చట్టం ఆవశ్యకతపై అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ (ఎఎస్ఎ) ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎఎస్ఎ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి దండు నవకిరణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలోని దొడ్డి కొమురయ్య సెమినార్ హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈ సమావేశం జరగనున్నట్లు తెలిపారు. శనివారం హన్మకొండలో సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పట్ల వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. అదే విధంగా టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు కూడా వివక్షను ఎదుర్కొంటున్నారని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన వివక్ష కారణంగానే రోహిత్ వేముల మరణించారని ఆరోపించారు. విద్యా సంస్థల్లో వివక్షకు అడ్డుకట్ట వేసేందుకు రోహిత్ వేముల చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఎఎస్ఎ పోరాటం కొనసాగిస్తుందని నవకిరణ్ తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది వి. రఘునాథ్, బెంగళూరు నేషనల్ లా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆశనాసింగ్, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది మృదుల వనంగముడి, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొంత ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమావేశానికి ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని దండు నవకిరణ్ కోరారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కేయూ విద్యార్థులు సురాశి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

**2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'**
**క్రీడా దినోత్సవ ముగింపు సభలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

**తిరుపతి,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**


అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో మాట్లాడుతూ.. భారతదేశానికే ఆదర్శంగా అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు కానున్నాయని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా సీఎం చంద్రబాబు.. ప్రముఖుల అకాడమీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. పీవీ సింధు, పు÷-లలెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖుల అకాడమీలకు ప్రభుత్వం నుంచి స్థల కేటాయించినట్లు చెప్పారు. అరకు నుంచి తిరుపతి వరకు, శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచంలో ఏ ఈవెంట్ జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక క్రీడాకారుడైనా పాల్గొనాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని చెప్పుకొచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం(ధ్యాన్‌చంద్ జయంతి), తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి) సందర్భంగా తిరుపతి వేదికగా క్రీడాకారులకు మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలియ జేశారు. రాబోయే 50 ఏళ్లకు సరిపడా అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని 3 జోన్లుగా(వైజాగ్, అమరావతి, తిరుపతి) విభజన చేసినట్లు తెలిపారు. క్రీడా పరికరాల తయారీ కోసం నెల్లూరు పరిసరాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తిరుపతిలో కేటాయించిన స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆడిటోరియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు పాఠశాలల గ్రౌండ్లను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రతిభను వెలికితీసేలా కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

## నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

**తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ**

న్యూఢిల్లీ,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్): నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

**రాత్రి అయితే చాలు.. గ్రామాల్లో అక్రమ గుడుంబా విక్రయాలపై ఆరోపణలు**
**మత్తులో మునిగిపోతున్న పేద కుటుంబాలు..**
**అధికారుల నిఘాపై ప్రజల ప్రశ్నలు**




**వరంగల్, 29 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి అయితే చాలు.. కొందరు గుడుంబా మత్తులో మునిగిపోతూ హద్దులు, ఒళ్లు మరచిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కష్టపడి, చెమటోడ్చి సంపాదించిన కూలీ డబ్బు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అవసరాలకు ఉపయోగపడాల్సి ఉండగా.. రాత్రి కాగానే గుడుంబా కోసం ఖర్చవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. పేద, చిన్నచితక కుటుంబాల్లో రోజువారీ సంపాదనతోనే పొయ్యి వెలిగే పరిస్థితులు ఉంటాయి. అలాంటి కుటుంబాల్లో సంపాదించిన డబ్బు గుడుంబా మత్తులో కరిగిపోతే భార్యా పిల్లల పరిస్థితి ఏమిటి? పిల్లల చదువులు ఎలా సాగాలి? ఇంటి ఖర్చులు ఎలా గడవాలి? అప్పుల బాధల నుంచి కుటుంబాలు ఎలా బయటపడాలి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గుడుంబా తాగేది ఒక్కరైనా.. ఆ మత్తు ప్రభావంతో నష్టపోయేది మాత్రం మొత్తం కుటుంబమే అని స్థానికులు పేర్కొంటున్నారు. గుడుంబా మత్తు కారణంగా కొన్ని కుటుంబాల్లో గొడవలు, కలహాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మద్యం మత్తులో ఇంటికి చేరి భార్యా పిల్లలను పట్టించుకోకపోవడం, కుటుంబ సభ్యులతో గొడవలకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో కుటుంబాల్లో ప్రశాంతత దెబ్బతినడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా మరింత పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారుల నిఘాపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలు, విక్రయ స్థావరాలపై నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఏమి చేస్తున్నారు? అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న వారిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేద కుటుంబాల బలహీనతను ఆసరాగా చేసుకుని అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు. అదే సమయంలో గుడుంబా మద్యానికి బానిసైన వారికి అవగాహన కల్పించి, అవసరమైన పునరావాస చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి అయితే చాలు.. గుడుంబా దందాకు తెరలేస్తోందా? మత్తులో మునిగిపోతున్న పేద కుటుంబాలను కాపాడేది ఎవరు? వరంగల్ జిల్లా వ్యాప్తంగా అక్రమ గుడుంబా దందాపై చర్యలు ఎప్పుడు? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చిన్న నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణకు సాంకేతిక యూనిట్లు

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ నివేదిక**



**హైద్రాబాద్, 29 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను పునరుద్ధరించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేలా సాంకేతిక యూనిట్లతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ--రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి నివేదికను అందించింది. కమిషన్ సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలోని చిన్న నీటిపారుదల వ్యవస్థ స్థితిగతులు, రైతుల అవసరాలు, నీటి వనరుల సమర్థ వినియోగంపై పలు అంశాలను వివరించారు. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని, రాష్ట్రంలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి చెరువులను పరిరక్షించాలని కమిషన్ కోరింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ ప్రజల జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని పేర్కొంది. గత రెండేళ్లుగా రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వానికి అందించిన సూచనలు, సిఫారసులను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సందర్భంగా కమిషన్ అందించిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పంటల మార్పిడిని ప్రోత్సహించడం, ఉద్యానవన పంటల సాగును మరింత పెంచడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోలు) ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ స్థిరీకరణ, నీటి వనరుల సమర్థ వినియోగం దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కమిషన్ గత రెండేళ్లుగా చేపట్టిన కార్యక్రమాలు, పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

## నీరు రంగు మారుతోంది జాగ్రత్త: చైనా హెచ్చరిక

**ఖాట్మండ్,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

హిమానీనదం బద్దలై ఇప్పటికే నేపాల్ లో వరదలు రాగా.. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఏర్పడిన సరస్సు పొంగుతోంది. దానిపై చైనా మరోసారి హెచ్చరిక చేసింది. ఏ క్షణాన అయినా అది ఉప్పొంగి, కిందికి దూసుకురావొచ్చని పేర్కొంది. నీటి రంగులో మార్పును అందుకు కారణంగా చెప్పింది. నేపాల్ విదేశాంగశాఖతో ఈ సమాచారాన్ని షేర్ చేసుకుంది. విపత్తు తర్వాత ఏర్పడిన సరస్సు రంగు మారుతోంది. ముదురురంగులోకి వస్తోంది. అంటే అది బద్దలయ్యేందుకు అవకాశం ఉంది అని చైనా అధికారులు వెల్లడించారు.

## ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు

**పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**

**నిజామాబాద్,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలపై బీఆర్ఎస్ జుక్కల్ నియోజకవర్గ స్థాయి నాయకుల సన్నాహక సమావేశం పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజలను నమ్మించి ఓట్లు తీసుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని గ్రామగ్రామాన ప్రజలను కలవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటిలో అమలైనవి, అమలు కానివి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల ముందు ప్రశ్నలు ఉంచి, హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మాత్రమే కాకుండా ప్రజలకు వాస్తవాలను వివరించే కార్యక్రమంగా నిర్వహించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వీజీ గౌడ్, జుక్కల్ నియోజకవర్గ సర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి భిక్షపతి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దపెదర్ రాజు, నియోజకవర్గ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాన్పూర్-మధురై మధ్య ప్రత్యేక రైళ్ళు

**వరంగల్,ఆగస్ట్29(జై భీమ్ న్యూస్):**

కాన్పూర్ సెంట్రల్- మధురై మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సెప్టెంబర్ 2 నుంచి రెండు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. నవంబర్ 28 వరకు ఈ రైళ్లు కాన్పూర్ సెంట్రల్- మధురై మధ్య నడుస్తాయి. కాన్పూర్ సెంట్రల్ - మధురై (01925) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 2 నుంచి నవంబర్ 25 వరకు ప్రతీ బుధవారం ఉదయం 8.10 గంటలకు కాన్పూర్ సెంట్రల్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 7.15 గంటలకు మధురై చేరుకుంటుంది. అదే విధంగా మధురై-కాన్పూర్ సెంట్రల్ (01926) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 5 నుంచి నవంబర్ 28 వరకు ప్రతీ శనివారం తెల్లవారుజామున 2.30 గంటలకు మధురై నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు కాన్పూర్ సెంట్రల్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల్లోని సిరిపూర్ కాగజ్‌నగర్, రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయి. వీటిలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, థర్డ్ ఏసీ ఎకానమి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ శనివారం తెలిపారు.

# గర్భిణులు కాఫీ తాగొచ్చా?

గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫీన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.




## ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?

ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి.జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిపుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.



## ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు

చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు.చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్దకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.



# మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది

మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్ ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.



# పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు

మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.



# పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శుభ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు.కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ప్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



# జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు.రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem TV


# బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్

ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట. నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.




## నాగార్జున వందో సినిమా

కింగ్ 100 గ్లింప్స్ విడుదల





అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్ఠాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్–టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

## ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల



నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఇరుముడి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు రెడీ




మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్–ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷–రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ూజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷–లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.

## మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల



టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో–ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.